క్లుప్తంగా

దళితుల అభివృద్ధికి సహకరించాలని వినతి


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యులు

మాడుగుల: దళితుల అభివృద్ధికి అందరూ సహకరించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, మరువాడ ఈశ్వరరావు కోరారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం తహసీల్దార్ పీవీ రత్నంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విభిన్న కోణాల్లో అన్ని వర్గాల వారు దళిత, గిరిజన సాంఘిక అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆత్మ గౌరవానికి భంగం కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో దళిత సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


పనులకు శంకుస్థాపన చేస్తున్న హరిబాబు

మాకవరపాలెం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. ఇటీవల మండలంలోని కింది తామరంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాగునీటి పథకం మంజూరుకు స్థానికులు ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో నిధులు మంజూరు చేయడంతో తాగునీటి పథకం ట్యాంకు నిర్మాణానికి శనివారం హరిబాబు, వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ అయ్యన్న, పార్టీ నేతలు నారాయణరావు, కృష్ణ పాల్గొన్నారు.

పాదయాత్ర గోడపత్రికల విడుదల

కె.కోటపాడు: పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం నాయకులు యర్రా దేముడు, రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. నిర్వాసితులను ఆదుకోవాలని ఈ నెల 20 నుంచి జూలై 10వ తేదీ వరకూ నిర్వహించనున్న మహా పాదయాత్ర గోడపత్రికలను శనివారం కె.కోటపాడులో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ, ఇల్లు, పునరావాసాన్ని కల్పించాలన్నారు. పాదయాత్రకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఉపాధి పనులు ప్రారంభం


ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు

చోడవరం: గోవాడలో ఎట్టకేలకు ఉపాధి హామీ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ కొంత మందికి జాబ్ కార్డులు ఉన్నప్పటికీ వారు పనిలోకి రాకపోవడంతో కొన్నేళ్లుగా ఉపాధి పనులు నిర్వహించలేదు. దీంతో ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు చొరవ తీసుకొని కొత్తగా కొత్తమందికి జాబ్ కార్డులు మంజూరు చేయించారు. అంతే కాకుండా రూ. 10 లక్షలతో ఉపాధి పనులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీనితో పనులు ప్రారంభం కావడంతో మొదటి రోజు 370 మంది కూలీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో ఉపాధి పనులు చేపట్టడంతో ఇప్పటి వరకూ కూలీ పనుల కోసం ఎదురుచూస్తున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు.

ఫ్లోరైడ్ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

రోలుగుంట: మండలంలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో కొన్ని రోజులుగా తలెత్తిన తాగునీటి సమస్యపై సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, సీఐటీయూ మండల నాయకుడు చిరంజీవి శనివారం నర్సీపట్నం ఆర్డీవో జయిరాంకు ఫిర్యాదు చేశారు. కొవ్వూరు, కిలపర్తిపాలెం, రోలుగుంట, నిండుగొండ, అంట్లపాలెం, కె.నాయుడుపాలెం, ఎస్.కొత్తూరు, మునిపల్లి తదితర ఫ్లోరైడు ప్రభావిత గ్రామాలకు పది రోజులుగా తాగునీటి సమస్య తలెత్తిందని వాపోయారు. స్పందించిన ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ వరహాలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పరిష్కార చర్యలు చేపట్టారు.

జగనన్న సురక్ష సర్వే ప్రారంభం

- ఇంటింటికీ వెళ్లి సమస్యలను గుర్తిస్తున్న ప్రత్యేక బృందం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే ప్రారంభమైంది. ఇంకా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారితోపాటు ఏమైనా సమస్యలు ఉన్నాయా లేవా? అని తెలుసుకుని పరిష్కరించేందుకు జల్లెల పడుతున్నారు. ఈ మేరకు ప్రజలకు కావాల్సిన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు వచ్చే నెల 1 నుంచి గ్రామ సచివాలయాల ద్వారా మంజూరు చేయనున్నారు.


తామరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అరుణశ్రీ


ఎ.కోడూరులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వలంటీర్లు


చమ్మచింతలో ఇంటింటికీ వెళ్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


గౌరీపట్నంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి


రావికమతం: అధికారులతో సమీక్ష చేస్తున్న ప్రత్యేకాధికారి కిరణ్

మాకవరపాలెం: జగనన్న సురక్ష అమలుతో ప్రతి సచివాలయంలోనూ 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తారని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి కోరారు. శనివారం తామరంలో జగనన్న సురక్షలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో వలంటీర్లు, ఎంపీడీవో అరుణశ్రీతో కలిసి ఆమె పాల్గొన్నారు. వచ్చే నెల 23 వరకు ఈ కార్యక్ర మం కొనసాగుతుందన్నారు. వలంటీర్లంతా ప్రతి ఇంటికీ వెళ్లి కార్యక్రమ ఉద్దేశాన్ని తెలియజేయాల న్నారు. పంచాయతీ కార్యదర్శి బాలదొర పాల్గొన్నారు.

నాతవరం: జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు, గృహసారథులు, వలంటీర్లు అంకితభావంతో పని చేయాలని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి తెలిపారు. శనివారం చమ్మచింత పంచాయతీలో ఎంపీడీవో హనుమంతరావు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. ఇంకా నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు ఉంటే నేరుగా ఇంటికే ఇస్తామన్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చిన్నబాబు, సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం పాల్గొన్నారు.

కె.కోటపాడు: వివిధ కారణాలతో సంక్షేమ ఫలాలు అందని అర్హత గల కుటుంబానికి లబ్ధిని చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎంపీటీసీ లెక్కల గౌతమి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం ఎ.కోడూరులో ఆమె వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్, గృహ సారథులతో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం ద్వారా మంజూరయ్యే 11 రకాల ధ్రువపత్రాలకు సంబంధించి ఆయా కుటుంబాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వారికి టోకెన్లు అందించారు. దాంతో పలువురు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ బొడ్డు ప్రకాశమ్మ, గ్రామ సచివాలయ కన్వీనర్లు బొడ్డు శ్రీనివాసరావు, లెక్కల శంకరరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, కోటకల నానాజీ, పాటూరి ఈశ్వరరావు, పాటూరు రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

చోడవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటినీ సందర్శించాలని వలంటీర్లను, సచివాలయ సిబ్బందిని ప్రత్యేకాధికారి రాజేశ్వరి ఆదేశించారు. గౌరీపట్నంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో శనివారం ఆమె సమీక్షించారు. వచ్చేనెల 1 నుంచి 28వ తేదీ వరకూ జరగనున్న జగనన్న సురక్ష సర్వేలో ప్రతీ ఇంట్లో సమస్యలను గుర్తించాలన్నారు. ఒకటో తేదీన గౌరీపట్నం, గంధవరం గ్రామ సచివాలయాల నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. తహసీల్దార్ తిరుమలరావు, సర్పంచ్ కోన చంద్రరావు పాల్గొన్నారు.

రావికమతం: వచ్చే నెల 1 నుంచి జగనన్న సురక్ష గ్రామ సభలను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమాయత్తం కావాలని మండల ప్రత్యేకాధికారి కిరణ్ అన్నారు. తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, అన్ని శాఖల అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు.

దేవరాపల్లి: అర్హత కలిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్షా కార్యక్రమం ఉద్దేశమని మండల ప్రత్యేకాధికారి వి. రవీంద్రనాథ్ తెలిపారు. ఇందులో భాగంగా వేచలం, మామిడిపల్లి గ్రామాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి శనివారం గృహ సందర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మామిడిపల్లిలో జెడ్పీటీసీ కర్రి సత్యం గృహ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, సర్పంచ్‌లు కర్రి సూరినాయుడు, నాగిరెడ్డి శరారినాయుడు, పంచాయతీ సెక్రటరీ చంద్రకళ పాల్గొన్నారు.


మామిడిపల్లిలో గృహ సందర్శన కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సత్యం, ప్రత్యేక అధికారి

చీడికాడ: సంక్షేమ లబ్ధి పొందని కుటుంబాలకు జగనన్న సురక్ష ద్వారా మేలు కలుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య అన్నారు. శనివారం ఆయన అప్పలరాజుపురం, బైలపూడి, జి. కొత్తపల్లి గ్రామాల్లో గ్రామ నాయకులు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమయ్యారు. అప్పలరాజుపురం సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారునికి అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 19వ వార్డు కొత్తబయపురెడ్డిపాలెంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో నీటికి ఇబ్బంది పడుతున్నామని రెండు చేతిపంపులు వేయించాలని మహిళలు ఎమ్మెల్యేను అభ్యర్థించారు. స్కూల్ వీధి రోడ్డు అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. వీటిపై స్పందించి ఆయన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలన్నది సీఎం ఆశయమన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేగా తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. ఏ ఒక్క అర్హుడికి సంక్షేమం అందకుండా పోకూడదనే జగన్‌మోహన్‌రెడ్డి తాపత్రాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్ బయపురెడ్డి చినబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు, పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి శ్రీనువాసరావు, అర్జున్ వెంకట్రావు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీనువాసరావు, యూత్ నాయకులు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం: ఈ నెల 21న ఆంధ్రా యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ గ్రౌండ్స్‌లో 500 మంది విద్యార్థులు యోగాసనాలు వేయడం ద్వారా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పారు. వీరితోపాటు పాల్గొన్న మేడివాడ హైస్కూలుకు చెందిన దివ్యాంగ విద్యార్థులు కొట్యాడ రాము, వియ్యపు హరీష్, పులకండం శ్యామ్‌కుమార్‌లను హెచ్‌ఎం వంకాయల రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు, ఎంపీటీసీ సత్యప్రసాద్, ఉప సర్పంచ్ వజ్రపు శివ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శేషుబాబు శనివారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఏపీ సమగ్ర శిక్ష, రోటరీ క్లబ్, ఆంధ్రా యూనివర్సిటీ యోగా డిపార్టుమెంట్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏయూలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ వివిధ రకాల యోగాసనాలు వేశారు.

అందరి ఆనందమే జగనన్న ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ముకుందపురంలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి వారి ముఖంలో ఆనందం చూడాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాపత్రయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ముకుందపురంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ లబ్ధిని వివరిస్తూ, ప్రజలు కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యాత్మకంగా ఉన్న వందెకరాల భూ సమస్యను పరిష్కరించేందుకుగాను తహసీల్దారును ఆదేశించారు. గ్రామ మొత్తంగా 7,13,56,194 కోట్ల రుపాయల సంక్షేమ లబ్ధి పొందారన్నారు. రూ.75.5 లక్షలతో ఇంటింటికీ 388 కుళాయిల ద్వారా నీరు అందిస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన పాత అంగన్‌వాడీ భవనాన్ని పూర్తిగా తొలగించి, దాని స్థానంలో కొత్త భవనానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ పాఠశాలల్లో నాడు – నేడు ద్వారా రూ.15.7 లక్షలతో పాఠశాల ఆధునికీకరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కర్రి పార్వతి అనే వితంతు పరిస్థితికి చలించిపోయి రూ.3 వేలు అందజేశారు. భర్త, కుమారై చనిపోవడంతోపాటు సొంత ఇల్లు లేదని పార్వతి ఆవేదన వ్యక్తం చేసింది. ఆమెకు ఇంటి స్థలం, స్కీమ్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీలో విద్యార్థిని పోట్ల దుర్గాభవానీ ఇంటర్ చదువు కొనసాగేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ కర్రి గణేశ్, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, స్థానిక గ్రామ సచివాలయ కన్వీనర్ కర్రి సుజాత, పార్టీ నాయకులు బాలిబోయిన కాశీ, రాంబుడ్డి ఫణీంద్ర, పెమ్మే శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ టి. శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు, మాజీ అధ్యక్షుడు సయ్యపురెడ్డి నారాయణరావు, నాయకులు పడాల అప్పలనాయుడు, గొల్లవిల్లి రాజేశ్, బొద్దాపు భాస్కరరావు, పోలిమేర చిన్నారావు, శ్రీనాథు జగ్గారావు, కల్యాణ రాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు యడ్ల కళావతి, కె. కృష్ణమూర్తి, జామి రమణబాబు, గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీడీవో మీనాకుమారి, తహసీల్దారు పి.వి.రత్నం, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, మండల ఇంజినీరింగ్ అధికారులు లెక్కల సత్యనారాయణ, నర్సింగరావు, భార్గవ్‌కుమార్ పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథస్వామి

చోడవరం: జగన్నాథస్వామి దశావతారాల్లో భాగంగా వరాహావతారంలో శనివారం భక్తులకు స్వామి వారు దర్శన మిచ్చారు. చోడవరం ప్రాచీన కేశవస్వామి ఆలయంలోని ఉపాలయంలో వేంచేసి యున్న ఫలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథస్వామికి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

వామనఅవతారంలో..


వామన అవతారంలో భక్తులకు దర్శన మిస్తున్న జగన్నాథ స్వామి

మాడుగుల: జగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా శనివారం స్వామివారు వామన అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన

– కింతాడ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో ప్రసాద్


విద్యార్థుల చదువులపై అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు: ప్రభుత్వ బడుల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం వల్ల మంచి విద్యాబోధన అందనున్నట్లు మండల విద్యాశాఖాధికారి డీవీడీ ప్రసాద్ తెలిపారు. కింతాడ, బత్తివానిపాలెంలో ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు అందాయా లేదా అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం రోజూ మెనూ ప్రకారం ఉండాలని ప్రధానోపాధ్యాయుడు దేముడుబాబుకు సూచించారు. బడిఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలల్లో చదువుకోవాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. తరగతి గదుల శుభ్రతతోపాటు పరిసరాలను పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంచాలని సూచించారు. కింతాడ హెచ్‌ఎం ఎస్.వసంతరాణి తదితరులు పాల్గొన్నారు.

బిందు, తుంపర్ల సేద్యానికి 1,400 రిజిస్ట్రేషన్లు


మాట్లాడుతున్న సూక్ష్మ సాగు నీటి వనరులు ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి

నాతవరం: జిల్లాలో బిందు, తుంపర్ల సేద్యం ఏర్పాటుకు రాయితీపై యూనిట్లు మంజూరు చేసేందుకు 1,500 హెక్టార్లకుపైగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని సూక్ష్మ సాగు నీటి వనరులు పథకం ప్రాజెక్టు డైరెక్టరు జి.వి.లక్ష్మి తెలిపారు. నాతవరం, వల్సంపేట ప్రాంతాల్లో ఆమె శనివారం పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం సూక్ష్మ నీటి వనరుల పథకం కింద 1,200 హెక్టార్లకు మించి సాగు విస్తరించేందుకు లక్ష్యాన్ని విధించిందన్నారు. బిందు సేద్యం ఐదెకరాల లోపు రైతుకు 90 శాతం రాయితీ, అంతకంటే అదనంగా భూమి ఉన్న రైతుకు 50 శాతం ఇస్తుందన్నారు. తుంపర సేద్యం ఐదెరాలలోపు రైతుకు 55శాతం రాయితీ అంతకంటే భూమి ఉంటే 45 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. ఆయా యూనిట్ల మంజూరు కోసం ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఇంతవరకు జిల్లా వ్యాప్తంగా 1,400 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ఇంతవరకు జిల్లా వ్యాప్తంగా 350 మంది రైతుల దరఖాస్తులు పరిశీలించామన్నారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు ఎంపీడీవో హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయండి

అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

దేవరాపల్లి: ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. దేవరాపల్లిలో శనివారం సాయంత్రం ఆయన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా రూ. 2 కోట్లతో చేపట్టిన నూతన ఎంపీడీవో నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పంచాయతీరాజ్ ఏఈ కె. ఉమామహేశ్వరరావుకు పలు సలహాలు, సూచనలు చేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వరదపురెడ్డి లలితానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దాసరి గోపి, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గుండు రాంబాబు, వాలేటి నాగరాజు, సబ్బవరపు మాలిబాబు పాల్గొన్నారు.

జోరువానలోనూ 'గడపగడపకూ'..

- తురకలపూడిలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్న విప్ ధర్మశ్రీ


జోరు వానలో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. తురకలపూడిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. జోరువాన కురుస్తున్న గ్రామంలోకి వచ్చిన విప్ ధర్మశ్రీకి, మండల నాయకులకు గ్రామస్తుల నుంచి విశేష ఆదరణ లభించింది. వైఎస్సార్ సీపీ పాలన బాగుందని, మరలా రెండోసారి జగనన్న ప్రభుత్వం వస్తోందని విప్ ధర్మశ్రీకి వివరించారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో వేయడం వల్ల ప్రభుత్వం మరింత విశ్వాసం పెరిగిందని, గ్రామ సచివాలయాల పాలన, రైతు భరోసాల ఏర్పాటు వల్ల అన్ని రకాల సేవలు సొంత గ్రామంలోనే అందుతున్నాయని తెలిపారు. గంట్ల, మంత్రి వారి వీధుల్లో డ్రైనేజీ, సీసీరోడ్లు ఏర్పాటు చేయాలని, రజకులు కుల వృత్తి చేసుకునే వద్ద మంచినీటి సమస్యను పరిష్కరించాలని, కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు గ్రామ సమస్యలను ధర్మశ్రీకి వివరించారు. ఇప్పటికే గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో రామాలయాల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయించానని, మూణ్నెల్లలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తానని, రజకులకు మంచినీటి బోరు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ పలు వీధుల్లో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు ఏర్పాటుతోపాటు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్ ఎర్రంశెట్టి గోవింద, వైస్ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు బుదిరెడ్డి నాగభూషణం, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, నాయకులు గంట్ల కాసు, చిన్నంనాయుడు, మహేష్, రామునాయుడు, వెంకటరమణ, మంత్రి వెంకునాయుడు, నానాజీ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి


రామన్నపాలెంలో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు


జగన్న కాలనీలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి తదితరులు


ఆర్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

మాకవరపాలెం: జగనన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ లబిదారులకు సూచించారు. రామన్నపాలెం, రాచపల్లిలోని జగనన్న లే అవుట్లను ఆయన శనివారం సందర్శించారు. నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో అరుణశ్రీ, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ ఆలయ సమీపంలో జగన్న కాలనీలో హౌసింగ్ డే సందర్భంగా ఎంపీడీవో మీనాకుమారి, గృహ నిర్మాణశాఖ ఏఈ లెక్కల సత్యనారాయణ శనివారం పరిశీలించారు.

కె.కోటపాడు: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం ఆర్లిలో జగన్న లేఅవుట్‌తోపాటు సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన 53 మంది లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శచీదేవి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, హౌసింగ్ ఏఈ రవిబాబు, మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు, ఈవోపీఆర్డీ ప్రసాద్, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అల్లు శ్వేత, సర్పంచ్ బోశం సందీప్, మాజీ సర్పంచ్ బోశం కృష్ణారావు పాల్గొన్నారు.

నాతవరం: ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసే ప్రతి లబిదారుడికి సకాలంలో బిల్లులు చెల్లింపులు చేస్తామని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి తెలిపారు. మండలంలో వై.డి.పేట, వల్సంపేట, నాతవరం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు, హౌసింగ్ జేఈ జోగారావు పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్‌కు 3 నుంచి పరీక్షలు

అనకాపల్లి టౌన్: డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక గవరపాలెం జీవీఎంసీ (బాలుర) హైస్కూల్లో వచ్చే నెల 3 నుంచి 6వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు www. bse. ap. gov. inలో హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సుల్లో ఏదో ఒకటి పరీక్షా కేంద్రానికి తీసుకు రావాలని ఆమె తెలిపారు.